


బీఆర్‌ఏయూలో రిటైర్డ్ ఉద్యోగుల తొలగింపు

ఎచ్చెర్ల, జూలై 4: పదవీ విరమణ చేసిన అనంతరం డాక్టర్ బీఆర్‌ఏయూలో విధులు నిర్వర్తిస్తున్న 12మంది అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులను తొలగించినట్టు వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వర్సిటీ హాస్టల్స్, రిజిస్ట్రార్ కార్యాలయం, పరీక్షల, ట్రాన్స్‌పోర్ట్, ప్లేస్‌మెంట్ సెల్ తదితర పాలనా కార్యాలయాలతో పాటు ఎడ్యుకేషన్ విభాగంలోని ఇద్దరు అధ్యాపకులను తొలగించామని పేర్కొన్నారు.

ఓ పోలీసు అధికారి.. వసూళ్ల యవ్వారం!



పాతబస్టాండ్ సమీపంలోని పెట్రోల్ బంక్



- వైసీపీ పాలనలో అడ్డుగోలుగా వ్యవహారాలు
- అందినకాడికి తీసేసుకున్న ఉన్నతాధికారి
- ఆ కుటుంబీకుడు కూడా సెటిల్‌మెంట్ల వీరుడే
- ఆరుగురు హోంగార్డులకు పెట్రోల్ కొట్టే విధులు
- ఆ డబ్బులన్నీ జిల్లా అధికారి జేబులోకే జమ
- కూటమి ప్రభుత్వం రావడంతో అన్నీ వెలుగులోకి..
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు
- బదిలీ తప్పదని తెలిసి జోరందుకున్న వసూళ్లు
- మెళియాపుట్టి నుంచి కలపతో చేసిన ఫర్నీచర్
- ప్యాకింగ్ చేసి స్వస్థలానికి పంపించినట్లు విమర్శలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొంతమంది పోలీసులు చేసిన అవినీతి వ్యవహారాలు ఇప్పుడు వెలుగు చూస్తున్నాయి. కిందిస్థాయి ఉద్యోగిపై ఆరోపణలు రావడం సహజం. కానీ.. పోలీసు ఉన్నతాధికారి అవినీతికి పరోక్షంగా పాల్పడ్డారంటూ విశ్వసనీయ సమాచారం. రేపోమాపో జిల్లా పోలీసుశాఖలో ప్రక్షాళన జరిగే అవకాశముంది. ఇదే అదునుగా అక్రమాల చిట్టా కూడా బయటపడింది. ఇటీవల తనిఖీల సమయంలో ప్రతిఫలంగా రూ.లక్షకుపైగా ఉన్నతాధికారికి, వ్యవహారాలు చూసే సిబ్బంది ఒకరికి మరో రూ.10వేలు కొన్ని స్టేషన్ల నుంచి ముడుపులు అందాయని తెలిసింది. ఇలా ముడుపులు ఇచ్చేందుకు స్టేషన్ సిబ్బంది జనం వద్దే వసూళ్లకు పాల్పడుతున్నట్టు సమాచారం.

● పెట్రోల్ బంకులో హోంగార్డుల విధులు..

శ్రీకాకుళం పాతబస్టాండ్ సమీపంలో పోలీసుశాఖకు చెందిన స్థలంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ పెట్రోల్ బంకు ఏర్పాటు చేసింది. పోలీసు శాఖకు నెలకు సుమారు రూ.1.2 లక్షల అద్దె చెల్లిస్తోంది. లీటరుకు రూ.3.20 చొప్పున కమీషన్ కూడా పోలీసుశాఖకు ఇస్తోంది. ఇదంతా అధికారికమే. అయితే పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంకు కావడంతో.. ఇక్కడ కల్తీకి ఆస్కారం ఉండదని అధికమంది వాహనదారులు పెట్రోల్ కోసం ఇక్కడకే వెళ్తుంటారు. రోజూ పెద్దఎత్తున లావాదేవీలు జరుగుతాయి. ఈ పెట్రోల్ బంకు వ్యవహారాలను చూసేందుకు ఏఆర్ విభాగం నుంచి ఆర్‌ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్, పోలీస్ కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులు విధులు నిర్వహిస్తుంటారు. ఇదీ అధికారికమే. ఈ బంకులో పెట్రోల్ విక్రయించేందుకు ప్రైవేటు సిబ్బంది ఉన్నారు. అలాగే పోలీసు విభాగానికి చెందిన ఓ ఆరుగురు హోంగార్డులు కూడా ఇందులో విధులు నిర్వహిస్తూ.. పెట్రోల్ విక్రయాలు సాగిస్తున్నారు. పోలీసు విభాగానికి చెందిన హోంగార్డులను ఇతరత్రా అవసరాలకు వినియోగించుకునేటప్పుడు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలి. కానీ ఆరుగురు హోంగార్డులను ఇక్కడ షిఫ్టుల వారీగా బంకులో విధులకు నియమించారు. వారి స్థానంలో మరో ఆరుగురు ప్రైవేటు వ్యక్తులు పనిచేస్తున్నట్లు లెక్కల్లో చూపించి బిల్లులు పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో ఏకంగా నెలకు రూ.1.2 లక్షల అక్రమాలు జరుగుతున్నాయని ప్రధాన ఆరోపణ. ఈ మొత్తం నేరుగా ఉన్నతాధికారికి చేరుతోందని విశ్వసనీయ సమాచారం. ప్రైవేటు సిబ్బంది ఉన్నా.. హోంగార్డులు పెట్రోల్ వేయడమేంటని ఆటోవాళ్లు, ద్విచక్ర వాహనదారులు విస్తుపోతున్నారు.

● సివిల్ వ్యవహారాల్లో కుటుంబీకుడి పెత్తనం..

ఉన్నతాధికారి కుటుంబీకుడు సివిల్ వ్యవహారాల్లో రెండున్నరేళ్ల నుంచి కల్పించుకుంటున్నారన్న చర్చ నడుస్తోంది. ఆయనకు ఏఆర్ విభాగం నుంచి గన్‌మెన్‌ను, డ్రైవర్‌ను, వాహనాన్ని సమకూర్చారు. ఆ వావాహనానికి ఏపీ 18పీ సిరీస్‌ను కూడా కేటాయించారు. నిబంధనల ప్రకారం అలా కేటాయించకూడదని సమాచారం. ఇక రెండున్నరేళ్ల నుంచి టర్న్ డ్యూటీలు తప్పించుకుంటూ.. జిల్లాలో అంతర్గత బందోబస్తు విధులు లేకుండా క్యాంపు ఆఫీస్‌లో తిష్ట వేసిన అసిస్టెంట్ రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ అన్నీతానై ఉన్నతాధికారి కుటుంబీకుడికి సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. ఏ ఫిర్యాదుకు ఎక్కడ నుంచి డబ్బులు వస్తాయన్నదో సమాచారం చెబుతూ తానూ పబ్బం గడుపుకొంటున్నారు. భారీగా లబ్ధి కల్పించుకున్నారు. తమకున్న పరిచయం పలుకుబడితో 'స్పందన'కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని సివిల్ వ్యవహారాలను 'సెంట్రల్ కంప్లయింట్ సెల్' ద్వారా తెలుసుకుని రంగంలోకి దిగుతున్నారు. సివిల్ వ్యవహారాలను.. భూవివాదాలను తమదైన శైలిలో పరిష్కరించి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నగదు.. లేదంటే డెబిట్ కార్డు మాత్రమే..

చెల్లింపుల విషయంలో పారదర్శకత తెచ్చేందుకు.. డిజిటల్ కరెన్సీని.. యూపీఐ ట్రాన్సాక్షన్స్‌ను కేంద్ర ప్రభుత్వం.. ముఖ్యంగా పెట్రోల్ బంకుల వద్ద అందుబాటులోకి తెచ్చింది. కానీ ఇక్కడ విడ్డూరం ఏంటంటే.. వాహనదారులు పెట్రోల్ కొనాలంటే నగదు కచ్చితంగా తెచ్చుకోవాల్సిందే. లేదంటే కేవలం డెబిట్ కార్డును మాత్రమే వినియోగించాలంట. ఫోన్ పే, గూగుల్ పే, అమెజాన్ పే, ఏటీఎం వంటివి ఇక్కడ అందుబాటులో లేకుండా చేసేశారు. ఎందుకంటే లెక్కల్లో పారదర్శకత తెలిసిపోతుందని ఇలా చేసినట్లు విమర్శలు ఉన్నాయి. అన్ని పెట్రోలు బంకుల్లో ఒక రూలు.. ఇక్కడ మాత్రం మరో రూలు అమలవుతోందని.. డిజిటల్ చెల్లింపులు కేవలం డెబిట్ కార్డులకే పరిమితం కాకుండా.. యూపీఐ చెల్లింపులకు కూడా అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఇక్కడ అంతుచిక్కని మతలబు ఉందని.. దీనిపై దర్యాప్తు జరిపితే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయన్నది విశ్వసనీయ సమాచారం.

ఇటువంటివి శ్రీకాకుళం, ఎచ్చెర్ల, రణస్థలం ప్రాంతాల్లో అధికంగా జరిగాయన్నది సమాచారం. అక్రమాలకు సహకరిస్తూ పబ్బం గడుపుతున్న అసిస్టెంట్ రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేరినట్లు తెలిసింది. అలాగే అతను తాను విధులు నిర్వహిస్తున్న ప్రాంతం నుంచి కదలకుండా కాగితాల్లో మాత్రం టర్న్ డ్యూటీలు నిర్వహించినట్టు చూపించడంపైనా ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఇక ఉన్నతాధికారి కుటుంబీకుడి విషయానికొస్తే.. అధికార పరిమితులు ఉపయోగించుకుని మెళియాపుట్టి అటవీ ప్రాంతంలో యాభైఏళ్ల నాటి చెట్టును కొట్టించి.. సిబ్బందితో ఫర్నీచర్ తయారుచేయించినట్టు భోగట్టా. ఇక బదిలీకి రంగం సిద్ధమైందన్న విషయం తెలియడంతో.. విలువైన ఫర్నీచర్ ప్యాకింగ్ చేసి స్వస్థలానికి పంపేసినట్లు ప్రచారం సాగుతోంది.

● నోరు మెదపలేని అసోసియేషన్..

భార్యను భర్త కొడితే.. ఆ వివాదం స్టేషన్ వరకు చేరితే.. సదరు భర్తపై ఉవ్వెత్తున పోలీసులు ఎగిసిపడుతుంటారు. కానీ అన్నీ తెలిసినా.. సిబ్బందికీ ఇబ్బందులున్నా.. కొన్ని చోట్ల అక్రమాలు జరుగుతున్నా నోరు మెదపలేని స్థితిలో పోలీసు అసోసియేషన్ సభ్యులు ఉన్నారు. ఆరుగురు హోంగార్డులు పెట్రోల్ బంకుల్లో అనధికారికంగా విధుల్లో నియమించడంపైనా ఏమీ అనలేకపోతున్నారు. అలాగే పోలీసు శాఖకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా వస్తున్న అద్దెలు.. పోలీసుల సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాలపైనా కనీసం తలదూర్చలేకపోతున్నారు. కొన్ని షాపుల నుంచి నిర్దేశించిన అద్దె కాకుండా.. అనధికారికంగా మరో రూ.2వేలు చొప్పున వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఈ అక్రమాలపై జిల్లాకు చెందిన కేంద్రమంత్రి, రాష్ట్రమంత్రి, ఎమ్మెల్యేలకు ఇప్పటికే ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలోనే పోలీసు శాఖలోనూ ప్రక్షాళన జరుగుతుందని తెలుస్తోంది.



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ బాధ్యతల స్వీకరణ

కలెక్టరేట్, జూలై 4: నూతన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అరసవల్లి పండితులు వేదమంత్రోచ్చారణ నడుమ.. అధికారులు అయనకు ఘన స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని పలు సెక్షన్‌ల హెచ్‌ఓడీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

సిక్కోలులో పనిచేయడం.. మధురానుభూతి

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, జూలై 4: శ్రీకాకుళం జిల్లాలో పనిచేయడం ఒక మధురానుభూతి అని బదిలీపై వెళ్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. గురువారం స్థానిక 80 అడుగుల రోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఉద్యోగులు నిర్వహించిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎన్నికల అధికారిగా.. సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేలా తన కల నెరవేరిందన్నారు. అధికారులు, ప్రజల ఆదరాభిమానాలు మరువలేనివన్నారు. విధి నిర్వహణలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జేసీ నవీన్ మాట్లాడుతూ.. నిరాడంబరతకు మారుపేరు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతి రావు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్‌ను సత్కరిస్తున్న జేసీ తదితరులు

బీఆర్‌ఏయూ వీసీ, రిజిస్ట్రార్ రాజీనామా చేయాలి

● టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన

ఎచ్చెర్ల, జూలై 4: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ తక్షణమే రాజీనామా చేయాలని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య (టీఎన్‌ఎస్‌ఎఫ్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వర్సిటీ వద్ద ఆందోళన చేశారు. వీసీ, రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వీసీ చాంబర్ ముందు బైఠాయించారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి రామ్మూర్తి, విజయనగరం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి బెవర భరత్, శ్రీకాకుళం పార్లమెంట్ అధ్యక్షుడు ప్రవర్ష మాట్లాడుతూ.. వీసీ, రిజిస్ట్రార్‌పై వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పాలకమండలి అనుమతులు లేకుండా, ఎలాంటి ప్రకటన, రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించకుండా, రిజర్వేషన్‌లు చూడకుండా 21 మందిని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా భర్తీ చేశారని ఆరోపించారు. వర్సిటీ నిధుల దుర్వినియోగం, ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టారన్నారు. గడచిన నాలుగేళ్లలో వర్సిటీలో నియామకాలు, నిధులు ఖర్చుపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. వీసీ, రిజిస్ట్రార్‌లు స్వచ్ఛందంగా పదవుల నుంచి వైదొలగేవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా వర్సిటీ అధికారుల వైఖరిలో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. అంతకుముందు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజనిని కలిసి గత నాలుగేళ్లలో జరిగిన నియామకాలు, నిధుల వినియోగంపై ప్రశ్నించారు. కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ ప్రతినిధులు నితిన్, రూపకుమార్, చక్రి పాల్గొన్నారు.



అంబేడ్కర్ వర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ ప్రతినిధులు

మొరాయించిన గూడ్స్

● రెండు గంటల పాటు నిలిచిన 'వందేభారత్'

ఇచ్ఛాపురం, జూలై 4: గూడ్స్ రైలు మొరాయించడంతో.. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. గురువారం ఉదయం జాడుపూడి సమీపంలో గూడ్స్ ఇంజిన్‌లో సమస్య తలెత్తడంతో పట్టాలపై నిలిచిపోయింది. అదే సమయంలో ఉదయం 7.20గంటలకు ఇచ్ఛాపురం స్టేషన్‌కు వందేభారత్ రైలు చేరుకుంది. కాగా.. గూడ్స్ మొరాయించడంతో పట్టాలపై లైన్‌క్లియర్ లేక ఇచ్ఛాపురంలో స్టేషన్‌లో వందేభారత్ రైలును 9.20గంటల వరకూ నిలిపేశారు. అలాగే ఉదయం 8.30 గంటలకు రావాల్సిన ప్రశాంతి రైలును బరంపురం-ఇచ్ఛాపురం మధ్య నిలిపేశారు. ప్రయాణికులు నిరీక్షించలేక ఇబ్బందులు పడ్డారు. తర్వాత లైన్‌క్లియర్ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.



ఇచ్ఛాపురంలో నిలిచిన వందేభారత్ రైలు.. ప్రయాణికుల నిరీక్షణ

పరిశ్రమల్లో భద్రత ఏదీ?

- జిల్లాలో కార్మికుల ప్రాణాలకు భరోసా కరువు
- యంత్రాల మధ్య నలిగిపోతున్న శ్రమజీవులు
- పట్టించుకోని అధికారులు, యాజమాన్యాలు
- గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మరీ నిర్లక్ష్యం



సరాక పరిశ్రమలో రియాక్టర్ వద్ద మంటలు అదుపు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

● జూన్ 29న పైడిభీమవరంలోని సరాక రసాయన పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రియాక్టర్ పేలడంతో భారీగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో సమీపంలో కార్మికులు లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ భారీగా వాహనాలు కాలిపోయాయి. రూ.కోటిన్నర వరకూ నష్టం వాటిల్లింది.

● ఈ నెల 2న పైడిభీమవరం పారిశ్రామికవాడలోని శ్రేయస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. నిల్వల గోదాములపై రేకులు బిగిస్తుండగా.. ప్రమాదవశాత్తూ షమీర్‌షేక్ (23), రహిబుల్‌షేక్ (23) జారిపడ్డారు. షమీర్‌షేక్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రహిబుల్‌షేక్‌ను విజయనగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆతడు చికిత్స పొందుతూ.. బుధవారం ప్రాణాలు కోల్పోయాడు. వీరిద్దరిదీ ఉత్తరప్రదేశ్. ఉపాధి కోసం ఇక్కడకు వచ్చి ఊహించని ప్రమాదంలో మృతి చెందడంతో కార్మికులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● తాజాగా పిషిని పంచాయతీ పరిధిలోని ఓ రసాయనిక పరిశ్రమలో గురువారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో పి.త్రినాధరావు, కె.గోవిందరావుకు స్వల్ప గాయాలయ్యాయి. ఒక డ్రమ్‌లోని రసాయన పౌడర్ పేలడంతో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. దీంతో అక్కడ ఉన్న ఈ ఇద్దరు కార్మికుల కళ్లు ఎర్రబడి తీవ్ర ఇబ్బంది పడ్డారు. వీరిద్దరినీ చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎటువంటి ప్రమాదం లేదని కార్మికులు తెలిపారు.

(రణస్థలం)

జిల్లాలో కార్మికులకు భద్రత కరువైంది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో పూర్తిగా నిర్లక్ష్యం రాజ్యమేలింది. పరిశ్రమల్లో, క్వారీల్లో, చివరకు భవన నిర్మాణ కార్మికులకు సైతం భద్రత కరువై.. ప్రాణాలు పోగొట్టుకున్నారు. కనీస వేతనాలు, సౌకర్యాలకు నోచుకోకపోగా.. మండుతున్న యంత్రాల మధ్య పనిచేస్తూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. జిల్లాలో పైడిభీమవరం పారిశ్రామికవాడతో పాటు పలాస ప్రాంతంలో జీడి పరిశ్రమలు ఉన్నాయి. టెక్కలి, పొందూరు వంటి ప్రాంతాల్లో క్వారీలు నడుస్తున్నాయి. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత లేదు. కార్మిక చట్టాలను యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయి. యంత్రాల మధ్య పనిచేసే కార్మికులకు హీట్ రెసిస్టెంట్ ఆప్రాన్లు, గమ్‌బూట్లు, హెల్మెట్లు గ్లౌజులు విధిగా అందించాలి. వీటిని అందించడంలో పరిశ్రమల యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. దీంతో పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులు మృత్యువాత పడుతున్నారు. క్షతగాత్రులుగా మారుతున్నారు. బాధితులకు నామమాత్రంగా పరిహారం అందించి యాజమాన్యాలు చేతులు దులుపుకొంటున్నట్టు ఆరోపణలున్నాయి.

● తరచూ ప్రమాదాలు..

పైడిభీమవరం పారిశ్రామికవాడలో సుమారు 30 వరకూ పరిశ్రమలున్నాయి. వీటిలో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. స్థానికంగా సరైన వైద్య సదుపాయాలు కూడా లేవు. పైడిభీమవరంలో 2010లో కార్మికుల సౌకర్యార్థం ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. కానీ వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించకపోవడంతో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. పరిశ్రమల్లో ఏ ప్రమాదం జరిగినా మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను విజయనగరం తరలిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 22,800మంది కార్మికులు గుర్తింపు పొందారు. వారి మూలవేతనం నుంచి 1.75 శాతం ఈఎస్‌ఐకి వెళ్తుంది. యాజమాన్యాలు సైతం కొంత మొత్తాన్ని భరిస్తున్నాయి. కానీ ఈఎస్‌ఐ సేవలు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. సకాలంలో అత్యవసర వైద్యం అందక చాలామంది మృత్యువాత పడుతున్నారు. అందుకే తక్షణం 100 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రితో పాటు అత్యాధునిక వైద్యసదుపాయాలు అందుబాటులోకి తేవాలని కార్మికులు కోరుతున్నారు. కార్మిక చట్టాలను పటిష్ఠంగా అమలుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఏపోఎల్ పరిశ్రమలో రియాక్టర్ పేలి.. పగిలిన గోడలు (ఫైల్)

● అమ్మో క్వారీలు..

జిల్లాలో వంద వరకూ క్వారీలు నడుస్తున్నాయి. అందులో అనుమతి ఉన్నవి కొన్నే. ప్రధాన రాజకీయ కుటుంబాలకు చెందిన వారి చేతిలో క్వారీలు ఉన్నాయి. అక్కడ ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నా బయటకు రాకుండా మేనేజ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. టెక్కలి, నందిగాం, పొందూరు, కంచిలి, పలాస మండలాల్లో క్వారీల నిర్వహణ అధికం. ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. కానీ వెలుగుచూసిన ఘటనలు కొన్నే. రాజకీయ జోక్యంతో అధికారులు అటువైపుగా చూడడం లేదన్న విమర్శలున్నాయి. అనుమతి లేకుండా క్వారీలు నిర్వహిస్తున్నా.. కార్మికులకు భద్రత లేకపోయినా కనీస చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కార్మికశాఖ పట్టించుకోవాలి

జిల్లాలో కార్మిక శాఖ ప్రేక్షక పాత్రకే పరిమితమవుతోంది. పరిశ్రమలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదు. కార్మిక చట్టాలను అమలు చేయకపోయినా చర్యలు తీసుకోవడం లేదు. కనీసం పరిశ్రమల్లో భద్రతా చర్యలు ఎలా ఉన్నాయో తనిఖీ చేసేందుకు కూడా ముందుకు రాకపోవడం దారుణం. ఇప్పటికైనా కార్మిక శాఖ దృష్టి పెట్టాలి.

- అమ్మన్నాయుడు, సీఐటీయూ నాయకుడు

గాలికొదిలేశారు

కార్మికుల భద్రతను గాలికొదిలేస్తున్నారు. పరిశ్రమల వద్ద కనీస భద్రతా చర్యలు చేపట్టడం లేదు. క్వారీలు సైతం ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు కోల్పోయే సమయంలో.. రేటు కట్టి చేతులు దులుపుకొంటున్నారు. కార్మిక చట్టాలు అమలుకావడం లేదు. చనిపోతున్నా పరిహారం దక్కడం లేదు.

-పి.తేజేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు

బిజినెస్

మరింత సులభంగా ఎస్‌బీఐ రుణాలు

న్యూఢిల్లీ: రుణాల మంజూరు ప్రక్రియను ఎస్‌బీఐ మరింత సులభం చేసింది. బ్యాంకు 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇందుకోసం అనేక చర్యలు ప్రకటించింది. వ్యవసాయ రుణాల్లో ఉండే నష్ట భయాన్ని (రిస్క్) సరిగా అంచనా వేసి, వేగంగా రుణాలు మంజూరు చేసేందుకు కొత్తగా 35 కేంద్రీకృత వ్యవసాయ ప్రాసెసింగ్ సెల్స్ (ఏసీపీసీ) ఏర్పాటు చేసింది. మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల హామీపై రుణాల మంజూరు కోసం తన ఎండ్ టు ఎండ్ డిజిటల్ యాప్ యోనో, భీమ్ ఎస్‌బీఐ పే యాప్‌లో రెండు ప్రత్యేక ఫీచర్లు జోడించింది. ఎస్‌బీఐ సూర్య ఘర్ లోన్ మంజూరు ప్రక్రియనీ సులభతరం చేసింది. ప్రవాస భారతీయుల బ్యాంకింగ్ అవసరాలు తీర్చేందుకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంది.

బైజూస్ జీతాలు చెల్లించాల్సిందే

ఎన్‌సీఎల్‌టీ

బెంగళూరు: ఎడ్యు స్టార్టప్ బైజూస్‌కి ఎన్‌సీఎల్‌టీ బెంగళూరు బెంచ్ గట్టి హెచ్చరిక చేసింది. ముందు ఉద్యోగుల జీతాల బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. లేకపోతే బైజూస్ ఆదాయ, వ్యయాల పుస్తకాలను ఐసీఏఐ ద్వారా ఆడిట్ చేయించాల్సి ఉంటుందని హెచ్చరించింది. రైట్స్ ఇష్యూ ద్వారా సేకరించిన 20 కోట్ల డాలర్లు తమకు అందుబాటులో లేనందున ఇప్పటికిప్పుడు ఉద్యోగుల జీతాలు చెల్లించడం సాధ్యం కాదన్న బైజూస్ వాదనని ఎన్‌సీఎల్‌టీ తోసిపుచ్చింది. బైజూస్ ఇప్పటికే నడుస్తున్న బిజినెస్ సంస్థ కాబట్టి, వచ్చే ఆదాయం నుంచి ఉద్యోగుల జీతాలు చెల్లించడం పెద్ద సమస్య కాదని స్పష్టం చేసింది.

పదేళ్ల గరిష్ఠ స్థాయిలో ఇళ్ల అమ్మకాలు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో గత ఆరు నెలల్లో 1,73,241 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడు పోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ. గత పదేళ్లలో ఎన్నడూ ఈ నగరాల్లో ఇన్ని ఫ్లాట్లు, ఇళ్లు అమ్ముడుపోలేదని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికలో తెలిపింది.

హైదరాబాద్‌లో మరింత పైకి: హైదరాబాద్ రియల్టీ గత ఆరు నెలల్లో 18,573 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 21 శాతం ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. ముంబై, ఢిల్లీతో సహా దేశంలో మరే ప్రధాన నగరంలోనూ ఇంత భారీ వృద్ధిరేటు నమోదు కాలేదు. ఆఫీసు స్పేస్ లీజుల విషయంలోనూ ఇదే పరిస్థితి. గత ఆరు నెలల్లో హైదరాబాద్‌లో 50 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీసు స్పేస్ కోసం లీజు ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 71 శాతం ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది.

మార్కెట్ దూసుకెళ్తోంది.. జర జాగ్రత్త!



సెబీ, శాట్‌కు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచన

మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని సలహా..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతున్న తరుణంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీతో పాటు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు (శాట్) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సూచించారు. అంతేకాదు, వ్యవస్థ సుస్థిరత కోసం శాట్ మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మార్కెట్ లావాదేవీలు భారీగా పెరగడంతోపాటు ఎప్పటికప్పుడు కొత్త నిబంధనలు అమలులోకి తెస్తున్న నేపథ్యంలో ట్రిబ్యునళ్లపై పనిభారం గణనీయంగా పెరిగిందని, ఈ నేపథ్యంలో అధికారులు కొత్త బెంచ్‌లను ఏర్పాటు చేసే దిశగా ఆలోచించాలన్నారు. శాట్ కొత్త కార్యాలయంతోపాటు కొత్త వెబ్‌సైట్‌ను గురువారం ప్రారంభించిన సందర్భంగా చీఫ్ జస్టిస్ ఈ వ్యాఖ్యలు చేశారు. తమ పెట్టుబడులకు చట్టాలు రక్షణ కల్పించగలవని, వివాదాలను పరిష్కరించేందుకు సమర్థవంతమైన వ్యవస్థలున్నాయని ఎప్పుడైతే మదుపరులు భావిస్తారో.. వారు మార్కెట్లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలుంటాయని, అలాంటి వాతావరణం దేశంలో పెట్టుబడుల పెరుగుదలకు, ఉద్యోగాల కల్పనకు, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. స్వలాభం కోసం ఒకరికొకరు హాని చేసుకునే ఆర్థిక ప్రపంచంలో శాట్ రిఫరీ పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. అందరూ నిబంధనలు పాటించేలా చూడాల్సిన బాధ్యత ఉంటుంది. మార్కెట్ సత్ప్రవర్తన, కార్పొరేట్ పాలన ప్రమాణాల అంశాలకు సంబంధించి శాట్ వద్ద అప్పీళ్లు కొన్ని రెట్లు పెరిగిన నేపథ్యంలో ట్రిబ్యునల్ సమర్థవంతంగా, పూర్తి సామర్థ్యంతో పనిచేసేందుకు శాట్‌లో ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని సూచించారు.

మోసగాళ్లపై సమాచారం ఇవ్వండి: బుచ్

మార్కెట్లో తప్పుడు పనులకు పాల్పడుతున్న వారి సమాచారం ఇవ్వాలని సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మార్కెట్ వర్గాలను కోరారు. స్వప్రయోజనాల కోసం తప్పుగా ప్రవర్తించే వారిపై ఫిర్యాదు చేయాలన్నారు. ఏదైనా తప్పుడు ప్రవర్తన వ్యవస్థాగత సమస్యగా రూపుదాల్చకుండా, మరిన్ని కఠిన నిబంధనలు ప్రవేశపెట్టే అవసరం లేకుండా వీలైనంత త్వరగా చర్యలు చేపట్టడమే సెబీ ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

కడప దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీలో కొత్త యూనిట్ ప్రారంభం

న్యూఢిల్లీ: దాల్మియా భారత్ ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో నిర్మించిన కొత్త యూనిట్‌లో వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభమయింది. ప్రస్తుతం ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 2.6 ఎంటీపీఏ కాగా కొత్త యూనిట్‌తో అదనంగా 1.0 ఎంటీపీఏ సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ విస్తరణతో తమ కంపెనీ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 46.6 ఎంటీపీఏకు పెరుగుతుందని పేర్కొంది.

డీసీఐకి రూ.156.5 కోట్ల కాంట్రాక్టు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి (డీసీఐ) రూ.156.5 కోట్ల విలువైన కొత్త కాంట్రాక్టు లభించింది. కొచ్చిన్ పోర్టులో ఏటా నిర్వహించే డ్రెడ్జింగ్ పనుల కాంట్రాక్టును డీసీఐ దక్కించుకుంది. కాంట్రాక్ట్‌లో భాగంగా కొచ్చిన్ పోర్టు అవుటర్ ఛానల్, అప్రోచ్ ఛానల్, ఐసీటీటీ బేసిన్, ఎల్ఎన్‌జీ బేసిన్ ఛానల్‌లో డ్రెడ్జింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుందని వివరించింది. మరో ఏడాది పొడిగించే నిబంధనపై ఈ కాంట్రాక్టు తమకు దక్కిందని డీసీఐ తెలియచేసింది.

2025 డిసెంబరు నాటికి సెన్సెక్స్ 1,00,000?

ఐదేళ్లకోసారి రెండింతలవుతున్న ఇండెక్స్

ముంబై: బీఎస్ఈ సెన్సెక్స్ గతంలో సాధించిన వృద్ధిని బట్టి చూస్తే, 2025 డిసెంబరు నాటికి 1,00,000 పాయింట్ల మైలురాయికి చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి. గడిచిన 45 సంవత్సరాల్లో సెన్సెక్స్ 15.9 శాతం సంచిత వార్షిక వృద్ధిరేటు (సీఏజీఆర్) నమోదు చేసుకుంది. 1979 ఏప్రిల్‌లో 100 బేస్ పాయింట్లతో ఏర్పాటైన సెన్సెక్స్. ఇప్పటివరకు 800 రెట్ల వృద్ధిని సాధించింది. 15.9 శాతం సీఏజీఆర్‌ను ముున్ముందూ కొనసాగించగలిగితే వచ్చే ఏడాది డిసెంబరు నాటికల్లా లక్ష పాయింట్లకు చేరుకోగలదని ఓ ఆంగ్ల దినపత్రిక కథనం అంచనా వేసింది. స్వల్పకాలంలో ఒడుదుడుకులకు లోనైనప్పటికీ, దీర్ఘకాలికంగా చూస్తే మాత్రం సూచీలు వృద్ధి పథంలోనే పయనించనున్నాయని అంటోంది.

మార్కెట్ పర్యవేక్షణ కోసం కేబినెట్ మంత్రిని నియమించాలి..

సెన్సెక్స్ ప్రస్తుత 15.9 శాతం సీఏజీఆర్‌తో ప్రతి ఐదేళ్లకు రెట్టింపవుతూ వచ్చిందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఛైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ అన్నారు. ఇదే ట్రెండ్ కొనసాగితే, 2029 నాటికి సెన్సెక్స్ 1,60,000కు చేరుకోగలదని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు, దేశీయ క్యాపిటల్ మార్కెట్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేబినెట్ సహాయ మంత్రిని నియమించాలని సూచించారు.

80,000 ఎగువన ముగిసిన సెన్సెక్స్

ముంబై: ఈక్విటీ సూచీలు గురువారం సరికొత్త ఉన్నత శిఖరాలకు చేరుకున్నాయి. క్రితం సెషన్‌లోనే 80,000 మైలురాయిని తాకి వెనక్కి వచ్చిన సెన్సెక్స్. తొలిసారిగా ఆ స్థాయికి ఎగువన ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం ఇందుకు తోడ్పడింది. సెన్సెక్స్ ఒకదశలో 400 పాయింట్ల మేర ఎగిసి 80,392.64 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 62.87 పాయింట్ల లాభంతో మరో జీవితకాల గరిష్ఠ స్థాయి 80,049.67 వద్ద స్థిరపడింది. 24,401 వద్ద ఇంట్రాడే రికార్డును నమోదు చేసిన నిఫ్టీ చివరికి 15.65 పాయింట్ల లాభంతో 24,302.15 వద్ద సరికొత్త గరిష్ఠ ముగింపును సైతం రికార్డు చేసింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ కూడా సరికొత్త గరిష్ఠ స్థాయి రూ.4,47,30,452.99 కోట్లకు (5.36 లక్షల కోట్ల డాలర్లు) దూసుకుపోయింది.

పదేళ్లలో ఫార్మా ఎగుమతులు 13,000 కోట్ల డాలర్లు

ప్రస్తుతం 2500 కోట్ల డాలర్లు; తెలంగాణ వాటా 35 శాతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత ఫార్మా ఎగుమతులు వచ్చే పదేళ్ల కాలంలో 13000 కోట్ల డాలర్లకు (రూ.10.85 లక్షల కోట్లు) చేరనున్నాయని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఇప్కా) ప్రెసిడెంట్ డాక్టర్ బి.పార్థసారథి రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఫార్మా ఎగుమతుల పరిమాణం 2500 కోట్ల డాలర్లున్నదని (రూ.2.08 లక్షల కోట్లు), అందులో ఒక్క తెలంగాణ వాటానే 35 శాతం ఉందని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం నుంచి జరుగనున్న 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ (ఐపీసీ) వివరాలు తెలియచేయడానికి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ ఔషధ మార్కెట్‌కు భారత్ ఎన్నో కీలక ఔషధాలు అందిస్తున్నదని తెలిపారు. ప్రపంచ మార్కెట్లో భారత ఫార్మాను మరింత విస్తరించి, పటిష్ఠం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. ప్రపంచ ఫార్మా రంగ ప్రముఖులందరినీ ఒకే వేదిక పైకి తెచ్చి ఫార్మా రంగాన్ని మరింత ఉత్తేజితం చేయడమే లక్ష్యంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఐపీసీ నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రపంచంలోని భిన్న దేశాలకు చెందిన 12 వేల మంది ప్రతినిధులు, 74 మంది వక్తలు ఈ సదస్సుకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పది సంవత్సరాల తర్వాత ఇంత భారీ స్థాయిలో ఐపీసీ సదస్సు హైదరాబాద్ వేదికగా జరుగుతోందని ఆయన వెల్లడించారు.

ప్లేస్‌మెంట్ కాంక్లేవ్

ఫార్మా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కోసం ఐపీసీలో భాగంగా ప్లేస్‌మెంట్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్టు ఐపీఏ అధ్యక్షుడు టీవీ నారాయణ చెప్పారు. పలు ఫార్మా కంపెనీలు ఇందులో పాల్గొని విద్యార్థుల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని, అర్హులైన వారికి ప్లేస్‌మెంట్ లేఖలు కూడా అందచేయనున్నాయని ఆయన తెలిపారు. ఐపీసీలో ఇలాంటి ప్లేస్‌మెంట్ కాంక్లేవ్ నిర్వహించడం ఇదే ప్రథమమని చెప్పారు. అలాగే స్టార్టప్‌ల కోసం ప్రత్యేక సెషన్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. విద్యార్థులు తమ ఊహాత్మక ప్రాజెక్టులను ఇక్కడ ఆవిష్కరించినట్టయితే ఉత్తమ ఆవిష్కరణను కార్యరూపంలోకి తెచ్చేందుకు అవసరమైన ఆర్థిక సహాయం, అందచేయనున్నట్టు ఆయన చెప్పారు.

డబ్ల్యూహెచ్ఓ అభియోగంలో నిజం లేదు

భారతదేశంలో తయారవుతున్న ఔషధాల్లో 35 శాతం కల్తీ ఔషధాలే అన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికను ఐపీసీ ప్రతినిధులు ఖండించారు. తక్కువ ధరలో నాణ్యమైన ఔషధాల కోసం ప్రపంచం యావత్తు భారతదేశం వైపే చూస్తున్నదన్నారు. ప్రపంచ ఫార్మాగా ప్రసిద్ధి చెందిన మన దేశం కొవిడ్ సంక్షోభ కాలంలో 150 పైగా దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేసిందని, అలాగే ఎన్నో కీలకమైన వ్యాక్సిన్లు ప్రపంచానికి అందించి ప్రజల ప్రాణాలు కాపాడుతున్నదని గుర్తుచేశారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,090 ▲	67,000 ▲	97,500
ముంబై	72,470 ▲	66,380 ▲	90,020

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	535
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	123
వరంగల్	112	గుంటూరు	123
కరీంనగర్	112	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	122
కర్నూలు	112	నెల్లూరు	122
విశాఖపట్నం	124	అనంతపురం	123
గోదావరి	123		

నవ్య | చిత్రజ్యోతి

వేడుకగా నటి వరలక్ష్మి వివాహ రిసెప్షన్

తరలివచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు







సినీ నటి వరలక్ష్మి, ముంబైకు చెందిన వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ల వివాహం రిసెప్షన్ బుధవారం రాత్రి చెన్నైలోని ఓ నక్షత్ర హోటల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు మంత్రి ఉదయనిధి, మలయాళ నటుడు, కేంద్రమంత్రి సురేష్ గోపి, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.అన్నామలై, టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి డి.జయకుమార్, శశికళతో సహా పలువురు రాజకీయ నేతలు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. చిత్రపరిశ్రమకు చెందిన సీనియర్ నటులు శివకుమార్, విజయకుమార్, నాజర్, నెపోలియన్, ప్రభుదేవా, ఆర్య, సిద్ధార్థ్, జీవా, అరవింద్ స్వామి, గౌతం కార్తీక్, మోహన్‌బాబు, సుదీప్, జాకీ ష్రాఫ్, తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన బాలకృష్ణ, వెంకటేష్, అల్లు అరవింద్, సినీ నటి ఖుష్బూ, ఆండ్రియా, సుకన్య, దేవయాణి, రమ్యకృష్ణ, రోజా, సుహాసిని, సీత, సంగీత దర్శకులు దేవ, శ్రీకాంత్ దేవా, తమన్, దర్శకులు భారతీరాజా, ఎస్ఏ చంద్రశేఖరన్, మణిరత్నం, కేఎస్ రవికుమార్, పి.వాసు, బాలా, సురేష్ కృష్ణ, ఆర్కే సెల్వమణి, చేరన్, ఐశ్వర్య రజనీకాంత్, ఎ.వెంకటేష్, ఏఎల్ విజయ్, అట్లీ, వసంత్‌బాలన్, నిర్మాతలు ఆర్‌బీ చౌదరి, ఏఎం రత్నం, ఐసరి కె.గణేష్‌తో పాటు అనేక మంది పాల్గొన్నారు. వివాహానికి ముందు జరిగిన సంగీత్ కార్యక్రమంలో సూపర్‌స్టార్ రజనీకాంత్, నటి త్రిష పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

- చెన్నై, (ఆంధ్రజ్యోతి)

డబ్బింగ్ పనుల్లో విశ్వంభర



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌కు 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. గురువారం ఈ సినిమా డబ్బింగ్ పనులు మొదలయ్యాయి. అత్యున్నత స్థాయి వీఎఫ్ఎక్స్‌తో తెరకెక్కుతోన్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో హనుమంతుడి భక్తుడిగా చిరంజీవి కనిపించనున్నారు. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: చోటా.కె.నాయుడు, సంగీతం: ఎమ్.ఎమ్.కీరవాణి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/nDerGdD లో చదవండి.

సమస్యలివి... పరిష్కారాలేవి?

నంది అవార్డులు ఏవీ?

ఒకప్పుడు నంది అవార్డుల ఉత్సవమంటే సినిమావాళ్లకు ఓ పండుగ! అవార్డుల ప్రదానోత్సవాలు కూడా అంత ఘనంగా జరిగేవి. నటులకు ప్రోత్సాహకంగా ఉండేది. రెండు రాష్ట్రాలు విడిపడిన తర్వాత నంది అవార్డుల ప్రస్తావనే లేదు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో 'సింహ' పేరుతో చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అవార్డుల కోసం ఎంట్రీలు కూడా స్వీకరించింది. కానీ ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ పదేళ్ల నుంచి తెలంగాణలో అవార్డుల ఊసే లేదు.

ఆంధ్రాలో పరిస్థితీ అంతే

ఆంధ్రప్రదేశ్‌లో ఇంతకుముందు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో మూడేళ్ల కాలానికి సంబంధించి ఒకేసారి కమిటీలు వేసి, నంది అవార్డులు ప్రకటించింది. అంతకుముందు రెండేళ్లుగా కూడా నంది అవార్డులు ఇవ్వకపోవడంతో ఒకేసారి వేడుక నిర్వహించి మొత్తం ఐదేళ్ల కాలానికి ఒకేసారి నంది అవార్డులు ఇవ్వాలని ప్లాన్ చేసింది. ఇంతలో ఎన్నికలు జరిగి చంద్రబాబు ప్రభుత్వం అధికారం కోల్పోయి, జగన్ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించింది. ఆయన నంది అవార్డుల గురించి పట్టించుకోనే లేదు. ఇటీవల తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం నంది అవార్డుల పేరు మార్చి.. గద్దర్ పేరిట సినిమాలకు అవార్డులు ఇస్తామని ప్రకటించింది. అయితే ఆ తర్వాత దీని గురించి ప్రాథమికంగా కూడా చర్చ జరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి కానీ, విడివిడిగా కానీ చిత్ర పరిశ్రమకు అవార్డులు ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని చిత్ర పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

పరిశ్రమగా గుర్తించాలి

సినిమాను ఒక పరిశ్రమగా గుర్తించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. అలా చేయడం వల్ల అనేక రాయితీలు లభిస్తాయి. ఫలితంగా చిత్ర నిర్మాణ వ్యయం తగ్గుతుంది. థియేటర్లు నిర్వహించేవారికి వెసులుబాటు కలుగుతుంది. ఖర్చులు కలిసి వస్తాయి. రాయితీల కారణంగా చిత్ర నిర్మాణాల సంఖ్య పెరిగి ప్రభుత్వానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆదాయం పెరుగుతుంది.

టికెట్ ధరల తికమక

సినిమా టికెట్ ధరలు పెంచే అధికారం ప్రభుత్వాలకు ఉంది. చిత్ర నిర్మాణ వ్యయం అంచనాలకు మించి పెరిగిన నేపథ్యంలో పెట్టిన ఖర్చు తిరిగి రాబట్టుకోవడానికి టికెట్ ధరలు పెంచుకోవడానికి భారీ చిత్ర నిర్మాతలు విడుదలకు ముందు ప్రభుత్వాలను అభ్యర్థించడం ఇటీవలి కాలంలో ఓ అలవాటుగా మారింది. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- రూ. వంద కోట్ల బడ్జెట్ దాటిన సినిమాలకు ధరలు పెంచుకోవటానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. అయితే కొన్ని సార్లు బడ్జెట్ ఎక్కువ అయినా నిర్మాతలు ఖర్చును తక్కువగా చూపిస్తారు. దీని వల్ల గత ఏడాది రెండు పెద్ద సినిమాలు తీవ్రంగా నష్టపోయాయి. అంతే కాకుండా ఎంత కాలం సినిమా టికెట్ ధరలు పెంచుకోవచ్చనే విషయంపై కూడా అస్పష్టత ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా కల్కి సినిమాకు 14 రోజులు ధర పెంచటానికి ఇచ్చిన జీఓపై కేసు ప్రస్తుతం హైకోర్టులో ఉంది. కొన్ని సినిమాలకు తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చినా , ఆంధ్రా ప్రభుత్వం మొండిచేయి చూపించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల రెండు రాష్ట్రాలు కలిపి టిక్కెట్ల ధర విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటిస్తే బావుంటుందని సినీ వర్గాలు కోరుకుంటున్నాయి. ఇదే విధంగా బుక్‌మై షో వంటి యాప్‌లకు ప్రేక్షకులు అదనంగా సర్వీస్ టాక్స్ చెల్లించాల్సి వస్తోంది. ఉదాహరణకు 250 రూపాయల టికెట్ ధరకు అదనంగా సుమారు 49 రూపాయలు బుక్‌మై షో కు చెల్లించాల్సి వస్తోంది. ఇలా కాకుండా ప్రభుత్వమే టికెట్లు విక్రయించే విధంగా యాప్‌లను అభివృద్ధి చేస్తే బావుంటుందంటున్నారు. జగన్ ప్రభుత్వం ఈ తరహా యాప్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటన చేసింది. కానీ ఇది కార్యరూపం దాల్చలేదు.



చిన్న సినిమాలూ బతకాలి!


ప్రతి ఏడాది తెలుగులో సుమారు 100 సినిమాలు విడుదల అవుతుంటాయి. వాటిల్లో పది నుంచి పదిహేను మాత్రమే పెద్ద సినిమాలు ఉంటాయి. అందుకే చిన్న సినిమాలు బతకాలంటే వాటికి ప్రత్యేకంగా రాయితీలు ప్రభుత్వ పరంగా ప్రకటించాలనే డిమాండ్ చిరకాలంగా ఉంది. ఈ విషయమై ప్రభుత్వంతో చర్చలు కూడా జరిగాయి. కానీ వాటిల్లో పురోగతి లేదు. థియేటర్లు దొరక్క ఇబ్బంది పడుతున్న చిన్న చిత్రాల నిర్మాతలను ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చి ఐదో ఆటగా చిన్న సినిమాను ప్రదర్శించుకోవడానికి అనుమతి ఇస్తామని ప్రకటించింది. కానీ అది అమలుకు నోచుకోలేదు. ఈ విషయం మీద కూడా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అలాగే రాష్ట్రం విడిపోక ముందు సందేశాత్మక, ప్రయోగాత్మక చిత్రాలకు పది లక్షల రూపాయలు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందించేది. ఆ తరహా చిత్రాలు నిర్మించే నిర్మాతలకు ఇది ఉపయుక్తంగా ఉండేది. అటువంటి విధానాన్ని మళ్లీ చేపట్టాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

డిజిటల్ చార్జీలు కంట్రోల్ చేయలేమా?

ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలుగు రాష్ట్రాల్లోనే క్యూబ్(డిజిటల్ ఫార్మాట్‌లో చిత్రాల ప్రదర్శన) చార్జీలు ఎక్కువ. గతంలో ప్రింట్ల విధానం ఉండేది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని థియేటర్లు డిజిటలైజ్ అయ్యాయి. దీని వల్ల ప్రేక్షకుల సంఖ్యతో నిమిత్తం లేకుండా- ఒక షో వేస్తే క్యూబ్‌కు రూ. 6500 చెల్లించాల్సిందే. ముఖ్యంగా సింగిల్ థియేటర్ యజమానులు ఈ పద్ధతి వల్ల చాలా నష్టపోతున్నారు. డిజిటల్ చార్జీల విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే సింగిల్ థియేటర్లకు మేలు జరుగుతుంది. . లేకపోతే నష్టాలు భరించలేక ఎక్కువ థియేటర్లు కల్యాణ మండపాలుగానో.. షాపింగ్ మాల్స్‌గానో మారిపోయే అవకాశముంది.

ప్రభుత్వానికి అండగా నిలుస్తాం

సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణలో టాలీవుడ్ చిత్ర పరిశ్రమ అన్ని వేళలా తెలంగాణ ప్రభుత్వానికి అండగా నిలుస్తుందని టీఎఫ్‌సీసీ (తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) తెలిపింది. ఈ మేరకు టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు దిల్‌రాజు, కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్, కే శివప్రసాదరావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలోనూ పలు సందర్భాల్లో చిత్ర పరిశ్రమ ప్రభుత్వానికి అండగా నిలిచింది, ఇకపైనా తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలిపింది. డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడిలో నటీనటులు, దర్శక నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్స్ యాజమాన్యాలు తమవంతు సహకారాన్ని అందిస్తారు, దీనిపై త్వరలో ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తాం' అని టీఎఫ్‌సీసీ తెలిపింది.



'జాయింట్ నంది అవార్డ్స్'...

తెలుగు సినీ రంగానికి సంబంధించి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో పైరసీ సమస్య ఒకటి. మరొకటి టికెట్ రేట్లు. అలాగే విద్యుత్ చార్జీలు కూడా తగ్గిస్తే.. పరిశ్రమకు మేలు జరుగుతుంది. తెలుగు సినీ రంగానికి తోడ్పడేలా ఇరు రాష్ట్ర ముఖ్యమంత్రులు కలిపి 'జాయింట్ నంది అవార్డ్స్' ప్రకటిస్తే బాగుంటుంది. ఒక సంవత్సరం హైదరాబాద్‌లో, ఇంకో సంవత్సరం అమరావతిలో ఆ వేడుకలను జరపాలి. ఇలా చేస్తే తెలుగు సినిమాకు.. తెలుగు వారికి మరింత ప్లస్ అవుతుంది.

- డి.సురేశ్‌బాబు, నిర్మాత

నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది



రాష్ట్రాలు రెండే కాని.. తెలుగు సినిమా రెండు రాష్ట్రాల్లోనూ ఆడుతోంది. గత ప్రభుత్వాలతో పోల్చితే ప్రస్తుతం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు సినీరంగ అభివృద్ధికి, తోడ్పాటుకు సుముఖంగా ఉన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులు కలసి మళ్లీ నంది అవార్డులను పునరుద్ధరిస్తే బాగుంటుంది. ఈ నిర్ణయం తెలుగు ప్రజలకు ఆనందం కలిగిస్తుంది. రేపు ముఖ్యమంత్రులిద్దరూ కలసి చర్చలు జరిపే నేపథ్యంలో ఇరు రాష్ట్రాలకు సంబంధించిన కళాకారులకు ఏదో ఒక పేరుతో అవార్డులు ప్రకటిస్తే బాగుంటుంది.

- ఎస్.వి.రామారావు, సినీ చరిత్రకారుడు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: బగ్గు

మబగాం(పోలాకి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం మబగాం సచివాలయంలో కౌలురైతులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో ఈ సదస్సులను నిర్వహిస్తోందని, అర్హులైన వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రవీంద్ర భారతి, వ్యవసాయాధికారి చిరంజీవి, డీటీ శ్రీనివాసరావు, కార్యదర్శి షైమావతి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దీర్ఘాశి సచివాలయంలో సర్పంచ్ మెండ సుమంగళి అధ్యక్షతన కౌలురైతుల సదస్సు జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మెండ ఇందిర మాజీ సర్పంచ్ పల్లి సూరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే


దుర్గామాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బగ్గు దంపతులు

జలుమూరు: ఎమ్మెల్యేగా ఎన్నికైన బగ్గ రమణమూర్తి సతీ సమేతంగా స్వగ్రామం మర్రివలస గురువారం వచ్చి గ్రామ దేవత దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. గ్రామస్థులు ముగ్రాటలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి ఆలయానికి చేరుకుని ముగ్రాటలతో చల్లదనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బగ్గు గోవిందరావు, సారవకోట ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, నాయకులు డోల జగన్, మెండ రాంబాబు, వెలమల రాజేంద్రనాయుడు, పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుకండి: జేసీ


రక్తదానం చేస్తున్న జేసీ నవీన్

ఎచ్చెర్ల: రక్తదానంతో ప్రాణదాతలు కావాలని జేసీ ఎం.నవీన్ అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్త దానం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకరరావు మాట్లాడుతూ.. 75 మంది యువకులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, తహసీల్దార్ శ్యామ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామ్మోహన్, పెంకి చైతన్యకుమార్, ట్రైనింగ్ ఆఫీసర్లు కామేశ్వరరావు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మొక్కలు నాటారు.

సెల్ఫ్ ఫైనాన్స్ బడ్జెట్ స్కూల్స్‌ను ఆదుకోండి

● మంత్రి అచ్చెన్నాయుడుకు ఆప్సా నేతల వినతి

పోలాకి: నిరుద్యోగులమైన మేమంతా పాఠశాలలను ఏర్పాటు చేసి అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామని, సెల్ఫ్ ఫైనాన్స్ బడ్జెట్ పాఠశాలలపై విధించిన నిబంధనలను మినహాయించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఆప్సా) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం విజయవాడలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి సమస్యలను వివరించి వినతిపత్రం అందించారు. 1994లో విడుదల చేసి జీవో ఎంఎస్ నెం.1లో ఎలకేషన్ ఆఫ్ ఫీజెస్, రికగ్నైజ్డ్ ప్యాటర్న్‌లో మార్పులు తీసుకురావాలని కోరారు. అలాగే విద్యుత్ కేటగిరి 2 నుంచి 4కు మార్పు చేయాలని, నోటరీ రిజిస్ట్రేషన్ లీజు అగ్రిమెంట్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ నేతలు మెట్ట జనార్దనరావు, పి.భాస్కరరావు, ఇలపండ గణపతిరావు, యు.సుబ్రమణ్యరాజు, రామకృష్ణారెడ్డి, మాణిక్యాలరావు, ఎం.అప్పాజీ తదితరులు ఉన్నారు.

నౌపడ అభివృద్ధికి చర్యలు తీసుకోండి



సంతబొమ్మాళి: నౌపడ పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానిక టీడీపీ యువ నాయకుడు సుగ్గు స్వరూప్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం విజయవాడలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో కాలువ వ్యవస్థ ఏర్పాటు, సకాలంలో వంశధార నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, నౌపడలో ఉప్పు మార్కెట్ ఏర్పాటుతో పాటు ఉప్పు పంట నిల్వలకు గొడౌన్‌లు నిర్మించాలని కోరారు.

చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

పలాస: చిన్నబడాం సర్వే నెంబరు 136/1లో 50 ఎకరాలున్న ఉదయసాగరం చెరువు ఆక్రమణలకు గురైందని, తక్షణం అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు గురువారం కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అమర్ డైట్ కళాశాల వద్ద ప్రభుత్వ రహదారి, పెసరపాడు, నర్సింపురం గ్రామాల వద్ద చెరువులు, బెజియాబంద చెరువులో అక్రమ లేఅవుట్లు ఉన్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆక్రమణలకు గురైన చెరువులు, కాలువలు, రోడ్లను పరిశీలించారు.

ఆక్రమణల తొలగింపు


పారశెల్లిలో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న అధికారులు

నరసన్నపేట: పారశెల్లి, చోడవరం గ్రామాల్లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. పారశెల్లిలో పాఠశాలకు వెళ్లే మార్గంలో గత ప్రభుత్వ హయాంలో పశువుల శాల నిర్మించారు. ఇటీవల ఈ వ్యవహారంపై గ్రామానికి చెందిన కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలీసుల సమక్షంలో దానిని తొలగించారు. అదేవిధంగా చోడవరంలో ఒక వ్యక్తి తన జిరాయితీ భూములో కాకుండా వేరొక వ్యక్తి భూమిలో కొంతమేరకు నిర్మాణం చేపట్టాడు. సదరు యజమాని ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించి అక్రమ నిర్మాణాలను తొలగించారు.

117 జీవోను రద్దు చేయాలి

నందిగాం: జీవో నెం.117ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, ప్రధానకార్యదర్శి బాలక శంకరరావు కోరారు. గురువారం కాపు తెంబూరు, నౌగాం, నరిపురం, లఖిదాసుపురం ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యారంగ సమస్యలను సేకరించారు. రేల్‌తో సంబంధం లేకుండా ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులను కొనసాగించాలని కోరారు. అనంతరం నందిగాం ఎంఆర్‌సీలో ఎంఈవో జి.నర్సింహులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కె.కుమార స్వామి, గణపతి రావు, అప్పలస్వామి, చిన్నవాడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వీసీని అవమానించడం విచారకరం

ఎచ్చెర్ల: మహిళా వీసీని అవమానించడం విచారకరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ రెక్టార్ బిడ్డిక అడ్డయ్య, డీన్‌లు యు.కావ్య జ్యోత్స్న, ఎం.అనూరాధ, ఎస్.లోకేశ్వరి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్సిటీలో అధికారుల విధులకు ఆటంకం కలిగించేలా టీఎన్ఎస్ఎఫ్ కార్యకర్తలు వ్యవహరించడం తగదన్నారు. వర్సిటీ పాలనా వ్యవహారాల్లో బయట వ్యక్తుల జోక్యం తగదని వీసీ కేఆర్ రజని అన్నారు. గతంలో జరిగిన తప్పిదాలపై కమిటీలు, ప్రత్యేక కమిషన్లు వేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలందించాలి: ఆర్డీ చిన్మయిదేవి

టెక్కలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలని ఐసీడీఎస్ ఆర్డీ జె.చిన్మయిదేవి అన్నారు. గురువారం టెక్కలి, కోటబొమ్మాళి, ఎచ్చెర్ల, సారవకోట మండలాల్లో ఐసీడీఎస్ కార్యాలయాలు, పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారం నిల్వల వివరాలు పక్కాగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పీవో, సూపర్‌వైజర్లు తరచూ పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి, కోటబొమ్మాళి ఐసీడీఎస్ పీవోలు పి.శోభారాణి, సీహెచ్ షైమావతి, సూపర్‌వైజర్లు లక్ష్మి, సంధ్యారాణి, జలజాక్షి తదితరులు పాల్గొన్నారు.

వంశధార కాలువలోకి సాగునీరు


టెక్కలి సమీపంలో కాలువలోకి ప్రవహిస్తున్న వంశధార నీరు

టెక్కలి: టెక్కలి సమీపంలోని వంశధార ప్రధాన ఎడమకాలువకు గురువారం వంశధార నీరు చేరుకుంది. ఈ నీటిని మదనగోపాలసాగరం జలాశయంలోకి అధికారులు తరలిస్తున్నారు. ప్రధాన ఎడమకాలువ వెంబడి సుమారు 300 క్యూసెక్కులకు మించి సాగునీరు రావడం లేదని రైతులు చెబుతున్నారు. ఏది ఏమైనా జూలై మొదటి వారానికే వంశధార ప్రధాన ఎడమకాలువకు సాగునీరు రావడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సాగునీటితో పల్లపు ప్రాంతాల్లోని చెరువులను నింపుతున్నారు.

వర్షంతో రైతుల్లో హర్షం


వరి ఎద పొలాల్లో చేరిన నీరు

జలుమూరు: మండలంలో గురువారం సాయంత్రం పడిన వర్షానికి రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పడిన వర్షాలకు రైతులు ముమ్మరంగా వరి ఎదలు వేశారు. పొలాల్లో విత్తనాలు వేసిన తరువాత మొలకెత్తే సమయంలో గత పది రోజులుగా వర్షాలు లేకపోవడంతో విత్తనాలు దెబ్బతిని మొలకలు పూర్తిస్థాయిలో రాక నష్టం జరుగుతుందని ఆందోళన చెందారు. అయితే ఈ తరుణంలో భారీ వర్షం పడి వరి ఎద పొలాల్లో వర్షం నీరు చేరడంతో మొలకలకు జీవం పోసినట్లయిందని రైతులు పేర్కొంటున్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలని విద్యాసంస్థల బంద్


పలాస: ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

పలాస: దేశవ్యాప్తంగా నీట్, సెట్‌లను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జంట పట్టణాల్లో విద్యాసంస్థలు గురువారం బంద్ పాటించాయి. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష ఫలితాల్లో అవకతవకలు జరిగాయని, తక్షణం దీనిపై విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్.రవి, ఎస్.దివ్య, గుణశేఖర్, విజయ్ పాల్గొన్నారు.

టెక్కలిలో..

టెక్కలి: నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై నిరసన తెలియజేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు విద్యార్థి సంఘాలు గురువారం బంద్ పాటించాయి. టెక్కలిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు బంద్‌కు సహకరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు పి.చందు, యు.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు తరుణ్, మహేష్, బాలకృష్ణ, మానస తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి: బాలికోన్నత పాఠశాల వద్ద బంద్‌లో పాల్గొన్న విద్యార్థినులు, ఎస్ఎఫ్ఐ నేతలు

నరసన్నపేటలో..

నరసన్నపేట: నీట్ పరీక్ష పేపర్ల లీక్‌కు నిరసనగా విద్యార్థి సంఘాలు చేపట్టిన బంద్ విజయవంతమైంది. గురువారం పట్టణంలో ప్రైవేటు విద్యాసంస్థలకు స్వచ్ఛందంగా సెలవులు ప్రకటించారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు.

తీరిన విద్యుత్ వెతలు

పలాసరూరల్: పలాస మండలం బ్రాహ్మణతర్లా సాయికాలనీ వీధిలో ప్రజలు విద్యుత్ లోఓల్టేజీతో గత కొన్నాళ్లుగా ఇబ్బందులు పడ్డారు. ఇటీవల గ్రామ టీడీపీ నేతల దృష్టికి సమస్యను స్థానికులు తీసుకువెళ్లగా విద్యుత్ అధికారుల ఆదేశాల మేరకు లైన్‌మెన్ శివ సహ కారంతో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు టీడీపీ నాయకుడు వడ్డి యాదగిరి, విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

కొత్తూరు: పాఠశాల విద్యార్థులకు సదుపాయాలు కల్పించడంలో ఎటువంటి లోపం లేకుండా చూడాలని ఐటీడీఏ డీడీ అన్నదొర అన్నారు. గురువారం డీప్యూటీ ఈవో నారాయుడు, ఏఎంవో పొట్నూరు కోటిబాబు, సీఎంవో చిరంజీవులు, జీసీడీవో రాములమ్మలతో కలిసి లబ్బ ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. తరగతి, వంట గదులు, వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని, విద్యార్థుల ఆరోగ్యాన్ని వైద్యులతో పరీక్షించాలని సూచించారు.

క్రీడా మైదానానికి భూమిపూజ

సంతబొమ్మాళి: మరువాడ పంచాయతీ చిన మరువాడ గ్రామ సముద్ర తీరంలో క్రీడా మైదానానికి సర్పంచ్ ప్రతినిధి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి సూరాడ దాసురాజు గురు వారం భూమి చేశారు. గ్రామాభివృద్ధి నిధులతో స్థానిక యువత ఆధ్వర్యంలో శ్రీనూకాలమ్మ తల్లి క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేరుగు నూకయ్య గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తహసీల్దార్ చలమయ్య మృతి


చలమయ్య (ఫైల్)

మెళియాపుట్టి: నందవ కొత్తూరు గ్రామానికి చెందిన తహసీల్దార్ జాలారి చలమయ్య అనారోగ్యానికి గురై గురువారం రాత్రి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. ఎన్నికలకు ముందు రంప చోడవరానికి బదిలీ అయ్యారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికాగా ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే గురువారం రాత్రి చికిత్సపొందుతూ మృతి చెందారు. ఎన్నికలకు ముందు ఆయన సంతబొమ్మాళి, మెళియాపుట్టి మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు న్నారు. చలమయ్య మృతితో స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

పెన్షన్ల జమతో రిటైర్డ్ ఉద్యోగుల్లో ఆనందం


కూటమి నేతల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

టెక్కలి: నూతనంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2వ తేదీ నాటికే రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు బ్యాంకు ఖాతాల్లో జమచేయడం ఆనందంగా ఉందని సంఘం నేతలు అన్నారు. ఈ మేరకు గురువారం రిటైర్డ్ ఉద్యోగులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్, అచ్చెన్నాయుడు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. గడచిన ఐదేళ్లలో పెన్షన్ల కోసం అనేక ఇబ్బందులు పడ్డామని, అయితే కూటమి ప్రభుత్వంతో ఆ ఇబ్బందులు తొలగాయని హర్షం వ్యక్తం చేస్తూ వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నేతలు బసవల అప్పలస్వామి, కాపల రఘునాథ్, రెయ్యి పున్నయ్య, సువ్వారి రాజేశ్వరరావు, రోణంకి రామచంద్రరావు, ఇప్పిలి జగదీష్, చిట్టిన్న, దాసరి వాసు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అర్హులకు చేర్చాలి


మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ వసంతస్వామి

వజ్రపుకొత్తూరు: ఐదేళ్ల వైసీపీ పాలనలో అనేక కష్ట, నష్టాలను ఎదుర్కొని ఎన్డీఏ ప్రభుత్వాన్ని గెలిపించుకున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ చేర్చే బాధ్యత అందరిపై ఉందని జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ గౌర కల వసంతస్వామి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వసంతస్వామి మాట్లాడుతూ.. పార్టీ గెలుపులో నేతలు, కార్యకర్తల సేవలు మరువలేనివన్నారు. మరో పదేళ్లు పార్టీని గెలిపించుకునేలా ప్రత్యేక ప్రణాళికలు రచించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల్లోనూ ఇదే స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ మాజీ ఛైర్మన్ పుచ్చ ఈశ్వర రావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, మాజీ అధ్యక్షుడు గోవింద పాపారావు, క్లస్టర్ ఇన్‌చార్జి కణితి సురేష్, తెలుగు యువత అధ్యక్షుడు మరడ దుర్యోధన రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అర్సవెల్లి ఉమామహేశ్వర రావు, ఎంపీటీసీ సూల చిట్టిబాబు, సురేఖ, మండల నెయ్యిల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సేవలో నూతన కలెక్టర్



కలెక్టర్‌కు జ్ఞాపికను అందిస్తున్న ప్రధాన అర్చకుడు శంకరశర్మ, ఆలయంలో సినీ నటుడు సంపూర్ణేష్ బాబు

అరసవిల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని గురువారం జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన స్వప్నిల్ దినకర్ పండ్కర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికారు. అలాగే సినీ నటుడు సంపూర్ణేష్ బాబు స్వామిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ సిబ్బంది జ్ఞాపికలు అందించారు.

మహాలింగార్చన

ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అనివెట్టి మండపంలో గురువారం మాసశివరాత్రి మహాపర్వదినం సందర్భంగా శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, వేద పండితులు శ్రీనివాసశర్మ, ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

శిక్షణ లక్ష్యాన్ని నెరవేర్చాలి

ఎచ్చెర్ల: ఉపాధ్యాయులు శిక్షణ శిబిరం లక్ష్యాన్ని నెరవేర్చాలని ప్రాంతీయ విద్యా సంచాలకుడు విజయభాస్కర్ అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, పొందూరు, జి.సిగడాం, ఆమదాలవలస మండలాల్లో సుమారు 150 ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో విలియం, కోర్సు డైరెక్టర్ కారు పున్నయ్య, రీసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.

టీడీపీ నేత సీతారాం మాస్టార్ మృతి


సీతారాం (ఫైల్)

కొత్తూరు: టీడీపీ సీనియర్ నేత, విశ్రాంత ఉపాధ్యాయుడు మునికోటి సీతారాం గురువారం గుండె పోటుతో మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి అండగా ఉన్న సీతారాం మాస్టార్ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, పార్టీ మండల నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నందిగాం: సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని టెక్కలి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జలజాక్షి అన్నారు. గురువారం నందిగాం-1 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యాధులపై తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లేశ్వరి, సుమతి, ఇందుమతి, ఏఎన్ఎం జయ, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దాడి నుంచి తప్పించబోతే విష ప్రచారం

● టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు, వైసీపీ బాధిత మహిళలు

పలాస: పట్టణంలోని పురుషోత్తపురం కాలనీకి సంబంధించి పింఛన్ల వ్యవహారంలో మునిసిపల్ ఛైర్మన్ బళ్ల గిరిబాబుపై తాను దాడికి పాల్పడలేదని, వాస్తవానికి అక్కడి బాధిత ప్రజల ఆగ్రహానికి ఛైర్మన్ గురవుతారని భావించి వెనక్కు తీసుకురాగా వైసీపీ సోషల్ మీడియా, వారి అనుకూల మీడియా తనపై విష ప్రచారం చేస్తున్నారని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్ అన్నారు. గురువారం కాలనీలో నాటి వైసీపీ బాధితులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా 155 మందికి ఇవ్వాల్సి ఉండగా సర్వర్ సమస్య కారణంగా 16 మందికి సచివాలయ సిబ్బంది తొలిరోజు ఇవ్వలేక పోయారన్నారు. పింఛన్లు ఇచ్చేందుకు ఒకరోజు గడువు ఉన్నా ఛైర్మన్ తన ఇంటి వద్దకు వచ్చి సచివాలయ సిబ్బందిపై అసభ్యకరంగా మాట్లాడారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పింఛన్లు, వివిధ పథకాలు పొందని వారు అక్కడికి వచ్చి వారిని నిలదీశారని, అయితే దాడి జరుగుతుందని భావించి ఛైర్మన్‌తో పాటు అతని సోదరుడిని వెనక్కు తప్పించానన్నారు. టీడీపీ ప్రభుత్వం బకాయిలతో కలిసి రూ.7 వేలు నగదు ఇవ్వడాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఛైర్మన్ సతీమణి ఇక్కడ పోటీ చేసి ఓటమి చెందారని, కక్ష సాధింపుగా తమపై విష ప్రచారాన్ని చేస్తున్నారని విమర్శించారు. వృద్ధురాలు రంధి రాజులమ్మ మాట్లాడుతూ.. తన ఇంటికి పసుపు రంగు వేశామని వైసీపీ ప్రభుత్వంలో పథకాలు రద్దు చేశారన్నారు. రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు ధర్మపురం అనిల్‌శర్మ మాట్లాడుతూ.. తనకు అమ్మఒడి, విద్యా కానుక వంటి పథకాలు రాకుండా వైసీపీ నేతలు కక్షసాధింపు చర్యకు పాల్పడ్డారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు దడియాల నర్సింహులు, కొరికాన వైకుంఠరావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉంటాం


ఎరువులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మామిడి సుధీష్ణ

పాతపట్నం: రైతులకు సేవలందించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే ఎంజీఆర్ సతీమణి, తామర పంచాయతీ సర్పంచ్ మామిడి సుధీష్ణ అన్నారు. సీది గ్రామంలో గురు వారం ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పాలకొండ వీఏఏ ఉషశ్రీ, తామర సర్పంచ్ ప్రతినిధి ఇప్పిలి ధనుంజయ, దండుగుల నారాయణరావు, ధర్మాన సూర్యనారాయణ, కృష్ణారావు, కాగితాపల్లి నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం

సంతబొమ్మాళి: 28ఆర్ మేఘవరం వంశధార కాలువ ద్వారా శివారు ప్రాంతలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని వంశధార ఏఈ అప్పలరెడ్డి అన్నారు. గురువారం మరువాడలో రైతులతో సమావేశం నిర్వహించారు. కొల్లిపాడు, రామసాగరం రిజర్వాయర్ నుంచి శివారు లింగూడు వరకు సాగునీరందేలా కాలువల్లో పూడికతీత చేపడతామన్నారు. సమావేశంలో మేఘవరం వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షుడు కర్రి రామిరెడ్డి, నాయకులు సూరాడ ధనరాజ్, ఎంపల్లి జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీలకు కార్డులుండాలి

నందిగాం: కౌలురైతులు వివిధ రకాల రాయితీలు పొందేందుకు గుర్తింపుకార్డులు పొందాలని వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. గురువారం రధజనబొడ్డపాడు, పెద్ద తామరాపల్లి, బెజ్జిపల్లిల్లో కౌలురైతుల అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సాగు ధ్రువీకరణ పత్రాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి. సింహాద్రి నాయుడు, నర్సింహులు, ఉమామహేష్, వీఆర్వో బాలరాజు, వీఏఏలు పాల్గొన్నారు.

మేఘవరంలో తాగునీటి కష్టాలు

సంతబొమ్మాళి: మండలంలోని మేఘవరం బీసీ కాలనీలో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాలనీలో ఉన్న ఒక్క బోరు పాడవడంతో నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తక్షణం అధికారులు స్పందించి బోరు బాగు చేసి తాగునీటి కష్టాలు తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

చంద్రబాబును కలిసిన ఎంపీ కలిశెట్టి



రణస్థలం: ముఖ్యమంత్రి చంద్రబాబును విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గురువారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారానికి సైకిల్‌పై వెళ్లడం ఆసక్తిగా ఉందని, తెలుగుదనం ఉట్టిపడేలా పార్లమెంట్‌కు వెళ్లడం మంచి పరిణామమని చంద్రబాబు అన్నట్లు కలిశెట్టి తెలిపారు.





గురుకుల విద్యార్థులకు అస్వస్థత


విద్యార్థితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

ఎచ్చెర్ల: దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలలోని పలువురు విద్యార్థులు కడుపునొప్పితో అస్వస్థతకు గురయ్యారు. ఈ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలకు సరైన ప్రహరీ లేకపోవడంతో కొంతమంది విద్యార్థులు బయటకు వెళ్లి ఫాస్ట్‌ఫుడ్స్ తీసుకోవడంతో రెండు రోజులుగా ఐదుగురు విద్యార్థులు కడుపునొప్పితో బాధపడుతున్నారు. వెంటనే పాఠశాల సిబ్బంది వీరిని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కి తరలించి అవసరమైన చికిత్స అందించి, తిరిగి పాఠశాలకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో గురువారం కూడా మరో ఐదుగురు విద్యార్థులకు కడుపు నొప్పి అంటూ ఇబ్బందిపడడంతో వీరిలో ముగ్గుర్ని ఆసుపత్రికి పంపించి పరీక్షలు నిర్వహించారు. ఇద్దరు విద్యార్థులకు మాత్రం పాఠశాలలోనే చికిత్స అందించారు. కడుపునొప్పి గురైన విద్యార్థులు పాఠశాలలోనే క్షేమంగానే ఉన్నారని ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు తెలిపారు. నాలుగు రోజుల కిందట ముగ్గురు విద్యార్థులు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో రిమ్స్‌కి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించగా.. అపెండిసైటిస్‌గా వైద్యులు గుర్తించి శస్త్ర చికిత్స చేశారు. అనంతరం వారిని ఇంటికి పంపించామని ప్రిన్సిపాల్ చెప్పారు. కాగా డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి, పొన్నాడ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్ శేషగిరిరావు, సౌమ్యశ్రీ గురువారం పాఠశాలను సందర్శించారు. వసతి గృహాన్ని, గురుకుల పరిసరాలను పరిశీలించి ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ ఆఫీసర్ జగన్నాథం, సూపరింటెండెంట్ డేవిడ్ తదితరులు వీరితోపాటు ఉన్నారు.

ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు


కంటైనర్ కిందకి దూసుకుపోయిన బైక్

కంచిలి: పెద్ద కొజ్జిరీయ జంక్షన్ సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిసా రాష్ట్రం చత్రపురం గ్రామానికి చెందిన దిలీప్ పౌరిడా (24)మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు, కంచిలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దిలీప్ పౌరిడా కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అతడితోపాటు అదే గ్రామానికి చెందిన హరిహర పరిడా, దిబా కల్యాణ్ ప్రధాన్‌తో కలిసి వేర్వేరు ద్విచక్ర వాహనాలపై బెంగళూరులో బయలుదేరారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పెద్దకొజ్జిరీయ జంక్షన్ సమీపాన రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను బలంగా ఢీకొట్టగా దిలీప్ పౌరిడా అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న హరిహర పరిడా గాయపడ్డాడు. ఇతడిని చికిత్స నిమిత్తం సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హరిహర పరిడా ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నరసన్నపేట: పట్టణంలో మారుతీనగర్-2లో ఉంటున్న సెక్యూరిటీ గార్డు అరుణ్‌కుమార్ భార్య మీనాకుమారి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు, 108 వాహన సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పాతపట్నం మండలం కొరసవాడకు చెందిన మీనా కుమారి తన భర్తతో కలిసి మారుతీనగర్-2లో ఉంటున్నారు. గత కొన్నాళ్లుగా ఇద్దరి మధ్య మనస్పర్థలతో కలత చెందిన మీనా కుమారి పాయిజన్ తీసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న 108 వాహన సిబ్బంది ఆమెను నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు 108 వాహన సిబ్బంది తెలిపారు. ఈ ఘటనపై ఏఎస్‌ఐ అసిరినాయుడు వద్ద ప్రస్తావించగా ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

హత్యకేసు నిందితుడికి రిమాండ్

పొందూరు: తాడివలస సమీపంలో వివాహిత అమలాపురపు రాజేశ్వరిని గొంతుకోసి హత్యచేసిన అముజూరు గోపాల్‌ను అంపోలు జైలుకు తరలించినట్టు ఆమదాలవలస సీఐ దివాకర్‌యాదవ్ తెలిపారు. హత్యకేసులో అరెస్టు చేసిన గోపాల్‌ను పొందూరు కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. దీంతో నిందితుడికి న్యాయాధికారి రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

వేధింపుల కేసులో ఏడాది జైలు

నరసన్నపేట: భార్యను వేధించిన కేసులో రావలవలస గ్రామానికి చెందిన తాళ్ల రాంబాబుకు ఏడాది పాటు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ గురువారం తీర్పు ఇచ్చినట్టు ఏపీపీ రొక్కం శాంతి సంతోషి తెలిపారు. ఏపీపీ తెలిపిన వివరాల మేరకు.. రాంబాబుతోపాటు అత్తమామలు, ఆడపడుచు నిత్యమూ వేధిస్తున్నట్టు అతడి భార్య కుమారి 2019 జూన్ 4న పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ ఎస్‌కే మహ్మద్ అలీ కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఈ కేసులో వాదోపవాదనలు విన్న న్యాయాధికారి రాంబాబుకు ఏడాది జైలు, రూ.1000 జరిమానా విధించారు. అత్తమామలతో పాటు ఆడపడుచుపై కేసును కొట్టివేశారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఇచ్ఛాపురం: ఇన్నేసుపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద వర్ధంతి నిర్వహించారు. వివేకానందను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరం, దాశరథి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం



ఎచ్చెర్ల: అజ్జరాం గ్రామంలో ఉన్న ఓ ఏటీఎంలో బుధవారం అర్ధరాత్రి కొంతమంది దుండగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఏటీఎం మిషన్ పగలు గొట్టినప్పటికీ నగదును తీయలేకపోయారు. గురువారం ఉదయం ఏటీఎంలో నగదు తీసేందుకు ఖాతాదారులు వెళ్లగా విషయాన్ని గుర్తించారు. అయితే ఏటీఎం మిషన్‌లో రూ.1.25లక్ష నగదు ఉన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఏటీఎం నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమాజఠలేశ్వరునికి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: న్యూవీధిలో ఉన్న ఉమాజలేశ్వరునికి మాస శివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు బి.అశ్విని కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


శ్రీకాకుళం కల్చరల్: గాంధీ స్మృతివనంలోని అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు


కలెక్టరేట్: కలెక్టరేట్‌లో జేసీ నవీన్ తదితరులు


అరసవల్లి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో..

ఘనంగా అల్లూరి జయంతి

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. దేశ చరిత్రలో అల్లూరి ఒక మహోజ్వల శక్తి అని పలువురు కొనియాడు. సాయుధ పోరాటం ద్వారా స్వాతంత్ర్య ఉద్యమం సాగించిన మహనీయుడని కీర్తించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, స్కూల్స్, సంస్థల్లో అల్లూరికి నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


గార: శ్రీకూర్మం గ్రామంలో నివాళులర్పిస్తున్న గ్రామస్థులు


ఎచ్చెర్ల: కుశాలపురంలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ తదితరులు..


ఇచ్ఛాపురం: అల్లూరి, భగత్‌సింగ్ విగ్రహాల వద్ద కూటమి నాయకులు..


శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాధిక..


ఆమదాలవలస: మున్సిపల్ కార్యాలయంలో..


పాతపట్నం: ఎమ్మెల్యే ఎంజీఆర్ క్యాంపు కార్యాలయంలో..


టెక్కలి: జనసేన పార్టీ కార్యాలయంలో..


జలుమూరు: సారవకోటలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో..


సంతబొమ్మాళి: శాఖా గ్రంథాలయంలో..


జి.సిగడాం: తహసీల్దార్ కార్యాలయంలో..


నరసన్నపేట: ఎంపీడీవో కార్యాలయంలో..


వజ్రపుకొత్తూరు: తహసీల్దార్ కార్యాలయంలో..


ఎల్ఎన్‌పేట: ఎంపీడీవో కార్యాలయంలో..


కంచిలి తహసీల్దార్ కార్యాలయంలో..


కవిటి, పోలాకి: మండల పరిషత్ కార్యాలయాల్లో..


నందిగాం తహసీల్దార్ కార్యాలయంలో..

ఇంకా జగన్ ఫొటోనే!

● మాజీ సీఎం జపంలోనే అధికారులు


నడిమివలసలో రేషన్ సరుకులు అందిస్తున్న వాహనంపై తొలగించని మాజీ సీఎం జగన్ ఫొటో

జి.సిగడాం: అధికారులు ఇంకా మాజీ ముఖ్యమంత్రి జగన్ జపంలో నుంచి బయటకు వచ్చినట్టు కనిపించడం లేదు. ఇందుకు ఈ ఫొటోయే నిదర్శనం. టీడీపీ అధికారంలోకి వచ్చి దాదాపు నెలరోజులు కావస్తున్నా.. ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే చాలా వాహనాలపై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి బొమ్మలు దర్శనమిస్తున్నా అధికారులకు పట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గురువారం నడిమివలస గ్రామంలో జగన్ ఫొటో ఉన్న వాహనంతో రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. కాగా దీనిపై సీఎస్‌డీటీ ఆర్.వెంకటేష్‌ను వివరణ కోరగా.. రేషన్ పంపిణీ వాహనాలపై ఉన్న మాజీ సీఎం జగన్ ఫొటోలను కప్పేయాలని ఎండీయూ ఆపరేటర్లను గతంలోనే ఆదేశించినట్టు తెలిపారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గార: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, రహదారి భద్రతలు పాటించాలని ఎస్‌ఐ కె.కృష్ణ ప్రసాద్ అన్నారు. కె.మత్స్యలేశంలో పాఠశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గంజాయి వినియోగం, బెల్ట్ షాపులు నిర్వహణ, రహదారి భద్రతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.లలిత, పాఠశాల చైర్మన్ బి.ఎర్రన్న, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన గీతామృతం

శ్రీకాకుళం కల్చరల్: గీతామృత కార్యక్రమం ఆహుతలను అలరించాయి. నగరంలోని బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో టి.శరత్ చంద్ర ఆధ్వర్యంలో గురువారం ఘంటసాల గీతామృతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఘంటసాల పాడిన పాత మధురిమలు, భగవద్గీత పైన ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. ఘంటసాల అభిమానులు, హైందవ ధర్మ దీక్షాపరులు, సంగీత ప్రియులు, పలువురు సినీ నటులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా సేవలు ఆదర్శనీయం


రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

లావేరు: దివంగత నేత, విజయవాడ మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగా సేవలు ఆదర్శనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఐ.తోటయ్యదొర అన్నారు. గురువారం రంగా జయంతి సందర్భంగా లావేరులో రంగా కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు రంగా అండగా ఉండేవారన్నారు. టీడీపీ నాయకులు కూనబిల్లి దామోదరరావు, పైడి శ్రీనివాసరావు, లంకలపల్లి శ్రీనివాసరావు, కాపు సంఘ నాయకులు పాల్గొన్నారు.

వంశధార, నాగావళి అధికారుల పరిశీలన

సరుబుజ్జిలి: కొత్తగెడ్డ ద్వారా రైతులకు సాగునీరు అందించడానికి గురువారం వంశధార, నాగావళి ఇంజనీరింగ్ అధికారులు పలు ప్రాంతాలు పరిశీలించారు. వంశధార ఈఈ సీతారామనాయుడు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు బొబ్బిలిపేట గ్రామ సమీపంలో వంశధార హెచ్‌ఎల్‌సీ కాలువ ద్వారా వచ్చే నీటిని నాగావళి నదికి అనుసంధానంపై ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇటీవల ఈ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే కూన రవికుమార్ మండలంలోని సుమారు 2,500 ఎకరాలకు సాగునీరు అందించడానికి, కొత్తగెడ్డ రైతులకు అవసరమైన సాగునీర అందించడానికి అవసరమైన చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అనుకూలత ప్రాంతం ద్వారా సాగునీరు అందించడానికి జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సనపల డిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో డీఈలు రవికిరణ్, మురళీమోహన్ పర్యటించారు. కొర్లకోట ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, సర్పంచ్‌లు జి.రమణమూర్తి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఆమదాలవలస: కొర్లకోట గ్రామంలో జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సనపల డిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు. గురువారం గ్రామంలోని సూర అప్పారావు ఇంటి నుంచి ఆర్అండ్‌బీ మెయిన్ రోడ్డు వరకు ఉన్న కాలువలో పేరుకుపోయిన చెత్తతోపాటు రహదారి ఆక్రమణలను జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందరంగా డిల్లేశ్వరరావు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు నిధులు మంజూరు చేయడంతో పారిశుధ్య వారోత్సవాల్లో చేపడుతున్నట్టు తెలిపారు. చెత్త తొలగించి క్లోరినేషన్ చేపడుతున్నట్టు తెలిపారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రతి ఒక్కరు చెత్తబుట్టల్లో వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సనపల అప్పలనాయుడు, పేడాడ గురువునాయుడు, గొండు రవి, పాత్రుని మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

పొందూరు: మేజరు పంచాయతీ పొందూరులో అస్తవ్యస్తంగా ఉన్న కాలువలు, చెత్తసేకరణపై దృష్టిసారించాలని పట్టణవాసులు కోరారు. సర్పంచ్ ఆర్.లక్ష్మి అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. కాలువల్లో పూడికలు పెరిగిపోయి మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని, వర్షం పడితే రోడ్లు కాలువలను తలపిస్తున్నట్టు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వర్షాకాలం వస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తాగునీటి పైపులైన్లు పునరుద్ధరించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈవో రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు ఎ.చినరంగ, బాడాన గిరి, డి.రవి, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడుల్లోనే ఉండాలి


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం: బడిఈడు పిల్లలు బడుల్లోనే ఉండాలని జడ్పీహెచ్ఎస్ ఈదుపురం ఒడియా పాఠశాల హెచ్‌ఎం భాస్కరపాడీ అన్నారు. గురువారం పాఠశాల ఆవరణ నుంచి పురవీధుల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్ గౌరోహరి బెహరా గ్రామ పెద్దలు పల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి గ్రామసేవ

శ్రీకాకుళం కల్చరల్: గ్రామ సేవయే రామ సేవ-పల్లె సేవయే పరమాత్ముని సేవ అంటూ బాబా తెలియజేశారని సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో గ్రామ సేవలు నిర్వహిస్తున్నారు. మాజీ ఎంపీపీ వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, చంటి, లలిత, ఆనందరావు, మద్ది గుప్త నాగేశ్వరరావు వైకుంఠరావు, బాలవికాస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు పొందాలి

ఆమదాలవలస: కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రానికి దరఖాస్తు చేసుకొని గుర్తింపు కార్డులు పొందాలని ఏవో మెట్ట మోహన్‌రావు అన్నారు. కలివరంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భూసార పరీక్షల ఫలితాలపై వివరించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.అశోక్, వీఆర్‌వో అనుపమ తదతరులు పాల్గొన్నారు.

● **సోంపేట:** సాగుదారు హక్కు పత్రాలకోసం కౌలు రైతులు మండల వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఏవో బి.నర్సింహమూర్తి కోరారు. సుంకిడి, ఎంజీపురం, మాకన్నపురం గ్రామాల్లో రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్‌వో యోగేశ్వరరావు, ఈశ్వరరావు, జీవన్, వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, భార్గవి తదితరులు ఉన్నారు.

● **గార:** శ్రీకూర్మంలో గురువారం ఉదయం కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో దుంపల పద్మావతి మాట్లాడుతూ.. కౌలు రైతులు గుర్తింపు పొందడం వల్ల పంట రుణాలు ఇతర రాయితీలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోరు అనిత, గ్రామస్థులు కోరాడ వెంకటరావు, గోర సురేష్, మైగాపు ప్రభాకరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** కౌలు రైతులకు సీసీఆర్‌సీ గుర్తింపు కార్డులు అందిస్తామని ఏవో టి.భార్గవి అన్నారు. గురువారం తేలుకుంచి, బిర్లంగి గ్రామాల్లో కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఇచ్ఛాపురం: ప్రతీ విద్యార్థిని చట్టాలపై అవగహగా కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఐసీడీఎస్ పీవో నాగరాణి అధ్యక్షతన మిషన్ సంకల్ప 100 రోజుల కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలకు వివిధ చట్టాలపై వివరించారు. వైస్ చైర్‌పర్సన్ ఉలా ల భారతి దివ్య, ఆశి జీవులురెడ్డి, నందికి జాని, ఎస్.కోటి, లక్ష్మి, రోకళ్ల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన శిబిరం ప్రారంభం

రణస్థలం: మండల కేంద్రంలో జనసేన నాయకుడు గొర్లె సూర్యారావు, డొక్కా సీతమ్మ అన్నదానం శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) గురువారం ప్రారంభించారు. ఎన్నికల ముందు 200 రోజులు అన్నదానం శిబిరం నిర్వహించి నిరుపేదల ఆకలి తీర్చారని, ఇప్పుడు మళ్లీ ప్రారంభించడం అభినందనీయమన్నారు. అదేవిధంగా రణస్థలం యూపీ స్కూల్‌ను ఎమ్మెల్యే ఎన్ఈఆర్ సందర్శించారు. విద్యార్థులతో కొంత సమయం ముచ్చటించారు. కూటమి నాయకులు విశ్వేక్షేన్, పిన్నింటి భాను, ఆకుల రవి ఉన్నారు.

రోడ్డు అభివృద్ధికి చర్యలు

గార: పూసర్లపాడు గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు మీద వర్షపు నీరు నిల్చిపోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు దుస్థితిపై ఎమ్మెల్యే గొండు శంకర్ స్పందించి ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఏఈ పి.హరనాథ్, ఉప సర్పంచ్ అరవల పెద్దబాబు గురువారం సాయంత్రం ఆ రోడ్డును పరిశీలించారు. కాంక్రీట్‌తో రోడ్డును ఎత్తు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు.